క్లుప్తంగా

నేడు సేవా కేంద్రం, ఆస్పత్రి భవనాల ప్రారంభం

అంబాజీపేట: చిరతపూడిలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రామ వికాస సేవా కేంద్రం, నూతన ఆస్పత్రి భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ఫౌండేషన్ కన్వీనర్ రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఎల్ ఆర్‌కే మూర్తి, కో కన్వీనర్ అసిస్టెంట్ ఎస్‌ఐ ఇళ్ల ఏడుకొండలు తెలిపారు. పేద ప్రజలకు, గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వారు ఆర్థిక సాయం రూ.13లక్షలతో ఈ భవనాలను నిర్మించినట్టు తెలిపారు.

నేడు మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో పాలకవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కార్యదర్శి యాళ్ల సత్య భాస్కరరావు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో సభ్యులంతా పాల్గొనాలన్నారు.

నరసన్న సన్నిధిలో తెలంగాణా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేంద్రకు స్వామి చిత్రపటం ఇస్తున్న సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం తెలంగాణా రాష్ట్ర అడిషనల్ జనరల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.రాజేంద్ర కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వారికి ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి ఆశీర్వచనాలు తెలిపారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తపేట: స్థానిక రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వి.మణికుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాడపాలెం పంచాయతీ వీధికి చెందిన కడలి గణపతి(72) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గణపతి గురువారం స్థానిక రామాలయం వద్ద నవమి అన్నసమారాధనలో భోజనం చేసి తిరిగి ఇంటికి వెళుతున్నాడు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం రోడ్డు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా ఆటో వచ్చి బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి, రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న చల్లా కుటుంబీకులు

ఆలమూరు: స్థానిక పసుపులేటి వారి వీధిలో గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు తన మనవరాలు వర్షశ్రీ మూడో జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు పేదలైన సుమారు 100 మంది దివ్యాంగులకు, వృద్ధులకు రూ.30 వేల విలువైన నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. గడుగోయల వివేకానందస్వామి, చల్లా భూషణం, జి.మణితేజ, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

మామిడికుదురు: డాక్టర్ యెరుబండి సత్యవర్ధనరావు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ప్రతిభా పరీక్షలో విజేతలుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహాలు అందించారు. దీనిలో భాగంగా ప్రముఖ డాక్టర్ కేవీ సత్యనారాయణను సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ నిరంజని అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ హెచ్‌ఎం మైలవరపు రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతలమోరిలో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దంపతులు



ఆదుర్రులో శ్రీరామనవమి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టిబాబు, రాజా



సంధిపూడిలో రామాలయం వద్ద సీతారామ కల్యాణం జరుపుతున్న భక్తులు



పి.గన్నవరం సెంటర్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం

కల్యాణ వైభోగమే..

- గ్రామ గ్రామాన శ్రీరామనవమి వేడుకలు
- ఘనంగా సీతారాముల కల్యాణం
- భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ

కొత్తపేట: శ్రీరామనవమి వేడుకలు గ్రామ గ్రామాన వైభవోపేతంగా జరిగాయి. సీతారాముల కల్యాణ కనుల విందుగా నిర్వహించారు. ఆంజేయస్వామి, సీతారాముల ఆలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. భక్తులతో కిటకిటలాడాయి. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఆలయ కమిటీలు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. కొత్తపేటలోని కోదండరామస్వామి వారి ఆలయం (కొత్త రామాలయం)లో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు పర్యవేక్షణలో వేదపండితులు ఖండవిల్లి అంజనేయాచార్యులు (అంజిబాబు) వేద మంత్రోచ్చారణ మధ్య ప్రధాన ఘట్టం నుంచి తలంబ్రాలు వరకూ కల్యాణ ఘట్టం కమనీయంగా చేశారు. పలువురు భక్తులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు. అనంతరం బెల్లం పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్న సమారాధన జరిపారు. కమిటీ సభ్యులు అన్యం మునేశ్వరరావు, కాకరపర్తి బంగారుబాబు, ముత్యాల చిట్టిబాబు, భక్తులు భక్తులు పాల్గొన్నారు. స్థానిక శ్రీరామనగర్ రామాలయంలో ఆ ఆలయ పోషకులు మామిడిశెట్టి సోమరాజు, రామకృష్ణ, గోవిందు సోదరుల దంపతులతో కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

అంబాజీపేట: మండలంలో సీతారామ కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులకు పానక ప్రసాదాలు, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

అయినవిల్లి: మండలంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముక్తేశ్వరం, అయినవిల్లి పెదపాలెం గ్రామాల్లో వేకువ జామునే యువకులు పల్లకీతో రామున్ని ఊరేగించారు. పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు.

ఆలమూరు: శ్రీరామనవమి వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. స్వామివారి కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బాజాభజంత్రీలతో, బాణసంచా కల్పులతో భక్తుల మధ్య నయనానందకరంగా జరిగింది. ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల తీర్థ ప్రసాదాల పంపిణీ, భారీ అన్నసమారాధనలు జరిగాయి.

మామిడికుదురు: ఆదుర్రు తెలగా వారి వీధిలో శ్రీవినాయక హనుమత్ సీతారామలక్ష్మణుల ఆలయంలో మూల విరాట్‌లకు జక్కంపూడి శ్రీనివాసరావు (చిన్ని), జ్యోతిరాణి దంపతులు రూ.3.50 లక్షలు విలువైన నాలుగున్నర కిలోల వెండి కిరీటాలను, అభయ హస్తాలను సమర్పించారు. అక్కడ జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీ దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

రావులపాలెం: రావులపాలెంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో పడాల కొండారెడ్డి, లీలావతి దంపతులు, భాస్కరరెడ్డి సుష్మిత దంపతులు కల్యాణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పెద్దింటి పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ పూజలు నిర్వహించారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలు కనుకగా సమర్పించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, చిన కెవి, మల్లిడి కోటీశ్వరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

మలికిపురం: చింతలమోరి గ్రామంలో జరిగిన నవమి వేడుకల్లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దంపతులు సీతారామ కల్యాణం నిర్వహించారు. శంకరగుప్తం, కేశనపల్లి, గొల్లపాలెం, తూర్పుపాలెం, గూడపల్లి, పల్లిపాలెం, ఇరుసుమండ, లక్కవరం, రామరాజులంక, గుడిమెళ్లంక, మట్టపర్రు, దిండి. మలికిపురం, కత్తిమండ, విశ్వేశ్వరాయపురం, పడమటిపాలెం, గుబ్బలపాలెం, అడవిపాలెం, బట్టేలంక, మేడిచర్లపాలెం గ్రామాలలో నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

రాజోలు: రాజోలులోని కోట వారి రామాలయం వద్ద సీతారామస్వామి కల్యాణం కన్నుల పండుగగా చేశారు. రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో స్వామివారిని రాజోలు వశిష్టా గోదావరి నదీ తీరానా ఊరేగించారు. బొడ్డపల్లి వారిపే, నున్న వారి బాడవ, మట్టపర్తి కాలువగట్టు, బి.సావరం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరం: పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో శ్రీసీతారామ వర్తక సంఘ ఆధ్వర్యంలో నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. వర్తక సంఘ అధ్యక్షుడు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, మహలక్ష్మి దంపతులచే స్వామి వారి కల్యాణం జరిపించారు. వర్తక సంఘ ఉపాధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు రాలింగి రామకోటేశ్వరరావు, గిడుగు బాబ్జీ, తమ్మన ప్రసాద్, కట్టా గోపి, రుద్రా గంగారావు, షేక్ దొరబాబు, నల్లా పెదకాపు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ప్రధాన ఆలయంలోని ఉపాలయం శ్రీరాముని సన్నిధిలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు తొలుత స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు. మండలంలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆత్రేయపురం: మండల పరిధిలోని ఆత్రేయపురం పెద్ద రామాలయం, చిన్న రామాలయం, హనుమాన్ జంక్షన్, అంకంపాలెం, వెలిచేరు, లొల్ల, పేరవరం, రాజవరం, ర్యాలి తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఆలయ నిర్మాతలు పాతపాటి రామాంజనేయరాజు, లక్ష్మి, పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు) దంపతులు, ప్రముఖ బిల్డర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, లావణ్య దంపతులు సమకూర్చిన పట్టు వస్త్రాలను పెద్దరామాలయం ఆలయ కమిటీ చైర్మన్ చిలువూరి లక్ష్మీపతిరాజు ఆలయానికి తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాజనేయరాజు, లక్ష్మి, ముదునూరి మురళీకృష్ణంరాజు లావణ్య దంపతులను గ్రామంలో పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ముఖ్యఅతిథిగా వాడపల్లి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు హాజరయ్యారు.



అంబాజీపేట మట్టపర్తి వారి పాలెంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



ఆదుర్రులో స్వామి వారి మూల విరాట్‌లకు అలంకరించిన వెండి కిరీటాలు, అభయ హస్తాలు



వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకుని వెళ్లుతున్న దృశ్యం



రావులపాలెం స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



రావులపాలెంలో సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కొత్తపేట శ్రీరామనగర్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

భయపెట్టి.. బంగారం అపహరించి..

మామిడికుదురు: వృద్ధురాలిని మాయ మాటలతో మభ్య పెట్టి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని రాత్రి సమయంలో నిర్జన ప్రదేశంలోకి తీసుకువెళ్లి ఆమెను బెదరించి ఆమె మెడలోని ఏడున్నర కాసుల రెండు బంగారు గొలుసులు చోరీ చేసిన సంఘటన అప్పనపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. దీనిపై నగరం ఎస్సై షేక్ జానీబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు బాధితురాలి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకాఘాకుళపు వసంతలక్ష్మి అప్పనపల్లిలో బంధువుల ఇంట జరిగే సీతారాముల కల్యాణంలో పాల్గొనేందుకు బుధవారం ఇంటి నుంచి బయలుదేరింది. ఆమె అమలాపురంలో బస్సు దిగి అక్కడి నుంచి వేరే బస్సు ఎక్కి పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌కు వచ్చింది. అదే బస్సులో వసంతలక్ష్మి వెళ్తున్న ఇంటికి వెళ్తున్న వంట మనిషి ఆమెకు తారస పడింది. ఇద్దరూ కలిసి అప్పనపల్లి వెళ్లేందుకు వేచి చూస్తున్న సమయంలో ఒక అపరిచిత వ్యక్తి అప్పనపల్లి వెళ్తున్నాను, మీ బంధువులు నాకు బాగా తెలుసని వసంతలక్ష్మిని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన వృద్ధురాలు బండి ఎక్కింది. ఆమెను బండెక్కించుకున్న అపరిచితుడు జన సంచారం లేని ప్రదేశానికి తీసుకువెళ్లాడు. వృద్ధురాలి మెడలో ఉన్న బంగారం ఇవ్వాలని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. సెల్‌ఫోన్ ఉందా అని అడగ్గా లేదని ఆమె చెప్పడంతో బంగారం తీసుకుని ఆమెను కొబ్బరి తోటల్లో వదిలేసి అక్కడ నుంచి పరారయ్యాడు. వంట మనిషి వేరే మోటారుసైకిల్ ఎక్కి అప్పనపల్లి వెళ్లడం, వృద్ధురాలు అప్పటికి ఇంటికి చేరకపోవడంతో ఆందోళన చెందిన బంధువులు ఆమె సెల్‌కు ఫోన్ చేయడంతో జరిగిన మోసం ఫోన్‌లో చెప్పి వసంతలక్ష్మి బోరున విలపించింది. ఆమెను వెతుక్కుంటూ వెళ్లిన బంధువులు ఆమె ఆచూకీ తెలుసుకుని నగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ చోరీపై నగరం ఎస్సై జానీబాషా దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లిలో విస్తృతంగా ఏర్పాట్లు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాలు ప్రారంభిస్తారు. భక్తులకు ఎండ వేడి తగలకుండా చలువ పందిర్లు ఏర్పాటు చేసి, ఫ్యాన్లు అమర్చారు. స్వామివారి దర్శనాలకు ఇబ్బందులు తలెత్తకుండా భారీ క్యూలు ఏర్పాటు చేశారు. లొల్ల నుంచి వాడపల్లి వరకూ అడుగడుగునా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహిస్తున్నారు. వాడపల్లి తీర్థానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. భక్తులకు ఆహ్లాదం కలిగించేందుకు వివిధ రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 1న రథోత్సవం, రాత్రి కల్యాణ మహోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరఫున విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఆర్‌డీఓ ముక్కంటిలు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. భక్తులకు స్వామివారి ప్రసాదం కొరత రాకుండా సుమారు 50 వేల లడ్డూలు సిద్ధంగా ఉంచారు.

కేశనపల్లి సొసైటీ టర్నోవర్ రూ.22 కోట్లు



సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న నారాయణ స్వామి

మలికిపురం: కేశనపల్లి పీఏసీఎస్ టర్నోవరు 22 కోట్లకు చేరుకుందని సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన సొసైటీ మహాజన సభ సంఘ కార్యాలయ ఆవరణలో జరిగింది. 2022–23 ఏడాది అంచనా బడ్జెట్‌తో పాటు జమా ఖర్చులను కూడా సభ ఆమోదించింది. ఈ ఏడాది జరిగిన ఆడిట్ రిపోర్టునూ సభ ఆమోదించింది. రైతులకు మెరుగయని సేవలతో పాటు బంగారంపై రుణాలు సక్రమంగా తీసుకుని విధిగా చెల్లిస్తున్నారని సీఈఓ కల్వ కొలను శ్రీనివాస్ తెలిపారు. డైరెక్టర్లు అప్పారి శ్రీనివాసరావు, సాధనాల రంగ, ఏఎంసీ ఉపాధ్యక్షులు సుంకర బాబ్జి, యర్రంశెట్టి సుబ్బరాజు, గోపాల కృష్ణ, అడబాల మూలాస్వామి నాయుడు, ఆకుల పైడేశ్వరరావు, అడబాల వెంకట స్వామి నాయుడు, మంద సత్యనారాయణ, పామర్తి సత్యనారాయణ, ఆకుల పల్లంరాజు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



శివాయలంకలో ప్రాథమిక పాఠశాల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పి.గన్నవరం: పేద విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసి, సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నాడు–నేడు రెండో విడత కార్యక్రమంలో భాగంగా రూ.25 లక్షలతో మానేపల్లి శివారు శివాయలంకలో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్ పితాని చంద్రకళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. ఎంఈఓ కోన హెలీనా, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, నాయకులు పితాని నర్సింహరావు, యన్నాబత్తుల నాగభూషణ్, మోకా శ్రీను, మానుకొండ రాంబాబు, పోతుల విజయ పాల్గొన్నారు.

నూకాంబికా ఆలయానికి భక్తుల తాకిడి



చింతలూరు నూకాంబికా ఆలయ ఆవరణలో క్యూలైన్ల వద్ద భక్తుల తాకిడి

ఆలమూరు: చింతలూరులోని నూకాంబికా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీరామనవమి పర్వదినంతో పాటు సెలవు దినం కావడంతో గురువారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. చిన్నారులు కాగడాలు వెలిగించి అఖండ దీపాలు సమర్పించారు. భక్తుల తాకిడి దృష్ట్యా పోలీసు యంత్రాంగం చింతలూరు జంక్షన్ వద్దే వాహనాలను నిలిపివేశారు. అయినా కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు వరకూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. గోశాల–గోపరంధామం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం భక్తుల దాహార్తిని తీరుస్తుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: మగటపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ సీహెచ్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఈదరాడ, కొమరాడ, మగటపల్లి, లూటుకుర్రు, గోగన్నమఠం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఓఎన్జీసీ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



గొల్లపాలెంలో ఓఎన్జీసీ అధికారులను అడ్డగించి నిలదీస్తున్న గ్రామస్తులు

మలికిపురం: గొల్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌ను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఓఎన్జీసీ అధికారులను అడ్డుకున్నారు. సైట్‌లో పనులు నిర్వహించేందుకు వచ్చిన అధికారులను, వాహనాలను నిలిపివేసి, వారితో వాగ్వాదానికి దిగారు. అనుమతి లేకుండా తమ భూములతోపాటు, నివాస ప్రాంతాల మధ్య అక్రమంగా డ్రిల్లింగ్ సైట్ ఏ విధంగా ఏర్పాటు చేస్తున్నారని ఆందోళన చేశారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీఓ తహసీల్దార్లకు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఆందోళన నిర్వహించారు. దీంతో ఓఎన్జీసీ అధికారులు చేసేదేమీ లేక అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆందోళనలో గంటా సుధాకర్, గంటా రామ స్వామి, రామారావు, రత్నాకర్, జి.శ్రీనివాసరావు, బి, నీలిమ, శ్యామల, సోని ఝాన్సీరాణి, ఎన్.రేష్మి, నీతిపూడి సరోజిని, సోమలత, మహిళలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన 40 ఏళ్ల మహిళ బొక్కా లక్ష్మి అదృశ్యమైందని ఆమె భర్త వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్సై షేక్‌జానీబాషా గురువారం తెలిపారు. మామిడికుదురులో బొక్కా వెంకటరమణ, లక్ష్మి నివాసం ఉంటున్నామని, ఆమె నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిగా పని చేస్తోంది. ఆమె గురువారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి కనిపించలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ఎట్టకేలకు డ్రైనేజీకి మోక్షం



హడ్కోకాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: కాలనీ ఏర్పడిన 42 ఏళ్లకు డ్రైనేజీకి మోక్షం కలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మాచవరం శివారు హడ్కోకాలనీలో డ్రైనేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత నెల 8వ తేదీన నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కాలనీ వాసులు వివరించారు. దాంతో కాలనీలో ప్రజలకు అత్యంత అవసరమైన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో గురువారం పనులు ప్రారంభించినట్టు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గత ప్రభుత్వంలో కాలనీలో డ్రైనేజీలు నిర్మిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు మాయ మాటలు చెప్పారే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు చెప్పారు. ఈ ప్రభుత్వంలోనే కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తున్నారని అభినందనలు తెలిపారు.

శాస్త్రోక్తంగా ఆబోతు ఖననం



మృతి చెందిన ఆబోతును ప్రొక్లెయిన్‌తో తరలిస్తున్న స్థానికులు

అంబాజీపేట: గ్రామ శివారు పీర్మాయిపాలెంలో తిరుతున్న ఓ ఆబోతు గురువారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందింది. ఆబోతు మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించి పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానికులు ప్రొక్లేన్ సహకారంతో ఆబోతును బండారులంక కౌశిక వద్ద శాస్త్రోక్తంగా ఖననం చేశారు. ఆబోతు మృతికి సంతాప సూచికగా మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.